## 'నీట్' పరీక్షా కేంద్రాల పరిశీలన

నస్పూర్, మే 3 : మంచిర్యాల పట్టణంలోని నాలుగు నీట్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శనివారం పరిశీలించారు. నేటి నీట్ పరీక్షకు భద్రత ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీపీ తెలిపారు. నాలుగు సెంటర్లలో 1224 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారని, వారికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపరింటెండెంట్‌కు పలు సూచనలు చేశారు. విద్యార్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావొద్దని, సమయంకన్నా ముందే పరీక్షా కేంద్రాలకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఎస్ఐలు ప్రమోద్‌రావు, పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ, కలెక్టర్



కుమ్రం భీం ప్రాజెక్టులో పడిపోయిన నీటి మట్టం



బంద్ పాటించడంతో నిర్మానుష్యంగా మంచిర్యాల మార్కెట్ ఏరియా

# ఉగ్రవాదులను ఉరితీయాలి

**మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు**

- మంచిర్యాల పట్టణ బంద్ విజయవంతం
- స్వచ్ఛందంగా సహకరించిన వ్యాపారులు, నాయకులు, ప్రజలు
- ప్రధాన చౌరస్తాల మీదుగా భారీ బైక్ ర్యాలీ

మంచిర్యాల అర్బన్, మే 3 : పహల్గాంలో హిందువులు, పర్యాటకులపై దాడి చేసిన పాకిస్తాన్ ఉగ్రవాదులను పట్టుకొని ఉరితీయాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు కోరారు. జమ్మూ-కాశ్మీర్‌లో ఉగ్రవాదుల జరిపిన మారణకాండకు నిరసనగా శనివారం హిందూ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణ బంద్‌కు పిలుపునివ్వగా, అన్ని వర్గాల ప్రజలు, వ్యాపారులు, నాయకులు పాల్గొని విజయవంతం చేశారు. మంచిర్యాలలోని ఐబీ చౌరస్తా నుంచి మార్కెట్ ఏరియా, బెల్లంపల్లి, లక్ష్మీ థియేటర్ చౌరస్తా మీదగా భారీ బైక్ ర్యాలీ తీశారు. జాతీయ జెండాలు పట్టుకొని భారత్ మాతాకీ జై... పాకిస్తాన్ డౌన్ డౌన్... అంటూ నినాదాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావ, నాయకులు మాట్లాడుతూ తీవ్రవాదుల దాడిని ప్రపంచ దేశాలు ఖండిస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులను త్వరగా పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. భారత దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ దేశానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. పట్టణ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, కాంగ్రెస్ నాయకులు తూముల నరేశ్, బీజేపీ నాయకులు వెరబెల్లి రఘునాథ్ రావు, హిందూ సంఘాలకు ఐక్య వేదిక అధ్యక్షుడు డేగ రవీందర్, కార్యదర్శి కర్ణ కంటి రవీందర్, ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు, వ్యాపారస్తులు, ప్రజలు, యువత, తదితరులు పాల్గొన్నారు.



హిందూ సంఘాలకు ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, ప్రజలు

# అడుగంటుతున్న అడ

## కుమ్రం భీం ప్రాజెక్టులో తగ్గుతున్న నీటి మట్టం

- ఆనకట్టకు పగుళ్లు తేలడంతో తక్కువ స్థాయిలో నిల్వ ఉంచిన అధికారులు
- ప్రస్తుతమున్నది రెండు టీఎంసీలే..!
- మరింత ఎండలు ముదిరితే డెడ్‌స్టోరేజ్‌కు..
- తాగు నీటికి సైతం ఇబ్బందులు తలెత్తే అవకాశం
- మరమ్మతులకు నోచుకోక ప్రమాదపుటంచున జలాశయం
- వచ్చే వానకాలంలో ఆనకట్ట పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన

కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 3 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రం సమీపంలోని కుమ్రం భీం ప్రాజెక్టు అడుగంటిపోతున్నది. 45 వేల ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు సామర్థ్యం 10 టీఎంసీలు కాగా, ప్రస్తుతం రెండు టీఎంసీల నీరు మాత్రమే ఉన్నది. ఎండలు మరింత ముదిరితే డెడ్‌స్టోరేజీకి చేరుకునే అవకాశముండగా, తాగు నీటికి సైతం ఇబ్బందులు తలెత్తే అవకాశమున్నది.

### ఆనకట్టకు బీటలు..

కుమ్రం భీం (అడ) ప్రాజెక్టును 10 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్-టీ నియోజవర్గాల్లోని 45,500 ఎకరాలకు సాగు నీరందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కొన్ని రోజులుగా ప్రాజెక్టు ఆనకట్టకు బీటలు పడుతున్నాయి. గత వర్షాకాలంలో కురిసిన వర్షాలకు కొండలు, వాగుల నుంచి పెద్ద ఎత్తున వరద రావడంతో కట్ట బీటలు వారి బలహీనపడింది. కట్టపై వేసిన తారు రోడ్డు కుంగిపోయింది. సైడ్‌వాల్ కూడా వరద తాకిడికి ధ్వంసమైంది. ఇన్‌ఫ్లోను ఎప్పటికప్పుడు గమనిస్తూ వచ్చిన అధికారులు ఎప్పటికప్పుడు గేట్లు ఎత్తి దిగువకు వరదను వదలడంతో కట్ట తాత్కాలికంగా నిలిచింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం వరకు నీటిని నిల్వచేస్తే కట్ట కొట్టుకుపోయే ప్రమాదముండడంతో అప్రమత్తంగా వ్యవహరించిన అధికారులు ప్రాజెక్టులో 5 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ 5 టీఎంసీల్లో 2 టీఎంసీలు మిషన్ భగీరథ కోసం వినియోగిస్తున్నారు.



కట్ట పగుళ్లపై కప్పిన పాలిథిన్ కవర్లు

### నివేదికలు పంపినా స్పందించని సర్కారు

ఆసిఫాబాద్ జిల్లాలోనే పెద్ద ప్రాజెక్టుగా పేరున్న కుమ్రం భీం ప్రాజెక్టు (అడప్రాజెక్ట్) ఈ ఏడాది కూడా మరమ్మతులకు నోచుకోవడం లేదు. ప్రాజెక్టు కట్ట మరమ్మత్తులకు నిధులు కేటాయించకపోవడంతో ఇది ఎంతోకాలం నిలువదేమోనన్న సందేహాలు కలుగుతున్నాయి. గత వానకాలంలో ప్రాజెక్టులోకి వరద రాగా, ఎప్పటికప్పుడు గేట్లు ఎత్తి వదిలేయడం వల్ల ఆనకట్ట తాత్కాలికంగా నిలిచింది. కట్ట మట్టి కొట్టుకుపోకుండా ప్లాస్టిక్ కవర్లు కప్పి అధికారులు రక్షించే చర్యలు తీసుకున్నారు. కానీ.. రోజులు గడిచిన కొద్దీ కట్ట కుంగిపోతూనే ఉన్నది. ప్రాజెక్టు మరమ్మతుల కోసం రూ. 5 కోట్లు అవసరమవుతాయని గతేడాది అధికారులు నివేదికలు పంపించారు. కానీ. ఇప్పటి వరకూ ప్రభుత్వం స్పందించలేదు. వచ్చే వానకాలంలో ప్రాజెక్టు పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

### డెడ్‌స్టోరేజీకి..!

అడ ప్రాజెక్టు మరమ్మతులకు సర్కారు నిధులు మంజూరు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు కింద 5 వేల ఎకరాలకు మాత్రమే సాగు నీరు అందుతున్నది. ఇక ప్రాజెక్టు కట్ట కూలిపోతే నీటిని నిల్వ చేసే అవకాశాలు తక్కువ.. ఇక అప్పుడు పంటలు సాగు చేయడం కష్టమేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రస్తుతం ప్రాజెక్టులో రెండు టీఎంసీల నీరు మాత్రమే ఉన్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం ఎండలు దంచికొడుతుండగా.. మరికొన్ని రోజుల్లో ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీకి చేరుకునే అవకాశమున్నది. అదే జరిగితే సాగు నీటితో పాటు తాగు నీటి( మిషన్ భగీరథ)కీ ఇబ్బందులు తప్పవని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## ప్రాణ చైతన్య దాస 'ఇస్కాన్ బెంగళూర్' సభ్యుడు కాదు

భీమారం, మే 3 : ప్రాణ చైతన్య దాస అనే వ్యక్తి ఇస్కాన్ బెంగళూర్ సంస్థకు సభ్యుడు కాదని, ఆయనకు తమ సంస్థకు ప్రాతినిధ్యం వహించే అధికారం లేదని, హరేకృష్ణ సంకీర్తన మూమెంట్ అనే సంస్థకు 'ఇస్కాన్ బెంగళూర్'కు ఎలాంటి సంబంధం లేదని ఇస్కాన్ బెంగుళూర్-హరేకృష్ణ మూమెంట్ హైదరాబాద్ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాణ చైతన్య దాస స్థాపించిన సంస్థతో ఎలాంటి లావాదేవీలు పెట్టుకోవద్దని హెచ్చరించారు. గత నెల 21న మంచిర్యాల జిల్లాలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రాణ చైతన్య దాస అనే వ్యక్తి ఇస్కాన్ బెంగళూర్‌కు చెందిన వాడినని ప్రకటించుకున్నాడని తెలిపారు. అంతేగాక హరేకృష్ణ సంకీర్తన మూమెంట్ సంస్థను స్థాపించానని, భీమారం మండలంలో స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమకు ఐదెకరాల భూమిని శ్రీ కృష్ణ బలరాం మందిరం నిర్మాణం కోసం కేటాయించారని చెప్పుకున్నాడని వారు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇస్కాన్ బెంగళూర్ భక్తులతో అధికారికంగా నిర్వహించబడుతున్న ఏకైక సంస్థ హరేకృష్ణ మూమెంట్ అని లేఖ విడుదల చేశారు.

# ఆర్టీసీ సమ్మెను విజయవంతం చేయాలి

- ఆర్టీసీ జేఏసీ నాయకుల పిలుపు
- సమ్మె పోస్టర్ విడుదల



మంచిర్యాల ఆర్టీసీ డిపో ఎదుట సమ్మెపోస్టర్ విడుదల చేస్తున్న జేఏసీ నాయకులు

మంచిర్యాలటౌన్, మే 3 : ఈ నెల ఏడో తేదీ నుంచి ప్రారంభంకానున్న ఆర్టీసీ సమ్మెను విజయవంతం చేయాలని టీజీఎస్ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మంచిర్యాల డిపో ఎదుట ఆర్టీసీ సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ గోలి శంకర్, కో కన్వీనర్ సేని తిరుపతి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, ట్రేడ్‌యూనియన్లపై విధించిన ఆంక్షలు ఎత్తివేయాలని, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, 2017 వేతన సవరణ బకాయిలు చెల్లించాలని, కొత్త అలవెన్స్‌లు అమలు చేయాలన్నారు. విరమణ ఉద్యోగులకు 2017 వేతన సవరణ జరిపి అన్ని బకాయిలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సిబ్బందిపై పనిభారం తగ్గించాలని, బ్రీత్ ఎనలైజర్ పరీక్షల కారణంగా నిరపరాధులైన డ్రైవర్లను శిక్షించవద్దని, మహాలక్ష్మి పథకంలో జరిగే తప్పిదాలకు సిబ్బందిని శిక్షించవద్దని, ఎలక్ట్రిక్ బస్సులను సంస్థనే నేరుగా నడిపించాలని, కారుణ్య నియామకాలను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించాలని, ఉద్యోగ ఖాళీలను భర్తీచేయాలని, అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. 2019 సమ్మెకాలంలో ఉద్యోగులపై నమోదుచేసిన పోలీసు కేసులు ఎత్తివేయాలని, పీఎఫ్, సీసీఎఫ్ నుంచి యాజమాన్యం వాడుకున్న డబ్బును వడ్డీతో సహా చెల్లించాలని, గ్యారేజ్ కార్మికులు, మహిళా కండక్టర్లు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపించాలని డిమాండ్ చేశారు.

# ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అన్యాయం చేసిండ్రు

**ఎంపీడీవో కార్యాలయం ఎదుట హత్తిని గ్రామస్తుల ధర్నా**



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న హత్తిని గ్రామస్తులు

దహెగాం, మే 3 : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో నిరుపేదలమైన తమకు అన్యాయం చేసిండ్రని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం హత్తిని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎలాంటి గ్రామ సభలు నిర్వహించకుండానే కాంగ్రెస్ నాయకులు, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శులు కుమ్మక్కై డబ్బులు తీసుకొని వారికి నచ్చిన వాళ్లకు ఇండ్లు కేటాయించారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు తమ కుటుంబ సభ్యులకు ఇండ్లు కేటాయించుకొని, అర్హులైన వారికి అన్యాయం చేశారని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. వెంటనే ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితాపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని, రీ సర్వే చేసి అర్హులకు ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శేగం రాకేశ్, రంగు సందీప్, గువ్వల సత్తయ్య, రెడ్డి మధు, పోల్క శ్రీనివాస్, సడెంక ప్రేమల, దేవల వంశీ, ఎర్గటి నర్సింహులు, పోల్క తిరుపతి, శేగం కమల, పోతరాజుల భాగ్యలక్ష్మి, బోలిశెట్టి మధు, సత్తయ్య, కొద్దని గణేశ్, నెర్పల్లి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



మట్టి తవ్వకాలను అడ్డుకున్న సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు

# చెరువులో మట్టి తవ్వకాలు ఆపాలి

- సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్
- నాయకులతో కలిసి పనుల అడ్డగింత

లక్షెట్టిపేట, మే 3 : లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల చెరువులో అనుమతుల పేరిట మట్టి దందా చేస్తున్నారని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఇటిక్యాల చెరువులో నాయకులతో కలిసి మట్టి తవ్వకాల పనులను అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువులోని మట్టిని తీస్తూ బఫర్ జోన్.. ఎఫ్‌టీఎల్‌లో వేస్తూ భూమిని కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఆ భూముల్లో మట్టి పోసి ఎత్తు చేసి లాభాగానికి అమ్ముకోవాలని చూస్తున్నారన్నారు. అనుమతుల పేరిట ఇష్టారాజ్యంగా, నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలించుకుపోతున్నారని, సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పనులను అడ్డుకొని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి బఫర్‌జోన్ భూములను కాపాడాలని న్యూ డెమొక్రసీ సీపీఐ ఎంఎల్ నాయకులు, మత్స్యకారులు డిమాండ్ చేశారు.

# తులం బంగారం ఇవ్వాల్సిందే



చెక్కులు పంపిణీ చేస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి**

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, మే 3: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు తులం బంగారం ఇవ్వాల్సిందేనని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో 90 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పేదింటి యువతులు పెళ్లిళ్లకు భరోసా ఇచ్చేందుకు కేసీఆర్ సర్కారు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దొంగ హామీలతో ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఆసిఫాబాద్ సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్ ఉన్నారు.

### విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ఆసిఫాబాద్ టౌన్, మే 3 : విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శనివారం ఆసిఫాబాద్ మండలం వావుదాం గ్రామంలో రూ. 13.5 లక్షలతో గిరిజన పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీలు విద్యపై దృష్టి సారించి ఉన్నతంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, మాజీ ఉపసర్పంచ్ లింబారావు, ఆదివాసీ నాయకులు జుగాది రావు, ధర్మారావు, నామ్‌దేవ్, కిస్మత్‌రావు, ఐటీడీఏ ఏఈ నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


